విశాఖ ఉక్కును కాపాడుకోవాలి

సీపీఐ జిల్లా కార్యదర్శి మరుపిల్ల పైడిరాజు

విశాలాంధ్ర - విశాఖ: 65 గ్రామాల ప్రజలు స్వచ్ఛందంగా 26 వేల ఎకరాల భూమి ఇచ్చి, ఎన్నో పోరాటాలు చేసి, చివరికి 32 మంది ప్రాణాలు బలిదానం చేసి, ప్రభుత్వ రంగంలో సోవియట్ రష్యా సహాయంతో సంపాదించుకొన్న విశాఖ ఉక్కు కర్మాగారాన్ని కేంద్రంలో ఉన్న నరేంద్ర మోడీ నాయకత్వంతో నడుస్తున్న ఎన్‌డీఏ ప్రభుత్వం పీక నులిమి చంపుతోందని సీపీఐ విశాఖ జిల్లా కార్యదర్శి మరుపిల్ల పైడిరాజు విమర్శించారు. కర్మాగారాన్ని నాశనం చేయడానికి ఉక్కు అధికారులందరినీ ఢిల్లీకి పిలిచి బ్లాస్ట్ ఫర్నేస్ లను మొదట 1, ఇప్పుడు 3 ని మూసివేసి పొమ్మనలేక పొగపెడితే వారే వెళ్ళిపోతారని కుట్ర చేస్తున్నారని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ కి చేస్తున్న అన్యాయం పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్య మంత్రి పవన్ కళ్యాణ్‌లు కేంద్రంపై ఒత్తిడి తేవాలని డిమాండ్ చేశారు. విశాఖ ఉక్కు లేకపోతే విశాఖపట్నం లేదన్నారు. ఉక్కును సెయిల్‌లో విలీనం చేసి తక్షణమే ఆదుకోవాలని కోరారు.

కామ్రేడ్ సీతారాం ఏచూరికి నివాళులు

విశాలాంధ్ర - తగరపువలస: కామ్రేడ్ సీతారామ్ ఏచూరికి సీపీఐ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో తగరపువలస జీఆర్ భవన్లో చిల్ల నర్సింహులు అధ్యక్షతన ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఐ, ఏఐటీయూసీ సీనియర్ నాయకులు అల్లు బాబురావు మాట్లా డుతూ వామపక్ష పార్టీలను, లౌకికవాద పార్టీలను ఒకే వేదిక పైకి తీసుకువచ్చి ఇండియా కూటమి ఏర్పాటులో తనవంతు కర్తవ్యాన్ని నిర్వర్తించారని ప్రస్తుతం వామపక్ష ఉద్యమం అనేక సమస్యలను ఎదుర్కొంటుందని ఈ తరుణంలో సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మరణం వామపక్ష ఉద్యమంనకు తీరని లోటని అన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు కానూరి రాంబాబు, మోరా అప్పల రాజు, ఏఐటీయూసీ నాయకులు కొండపు ఈశ్వరావు, మావూరి సన్యాసమ్మ, చిల్ల రాంపైడి, చిల్ల అప్పలసూరి, వీర్రాజు, నూలు ఆదినారాయణ, సూరిబాబు పాల్గొన్నారు.

గుడాల రాంబాబును పరామర్శించిన ఎన్ఎఫ్ఐడబ్ల్యూ

విశాలాంధ్ర - మల్కాపురం: సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు గుడాల రాంబాబు ఆరోగ్యం బాగులేనందున నగరంలోని ప్రైవేట్ హాస్పిటల్లో చేరారు. ఆయనను శనివారం ఎన్ఎఫ్ఐడబ్ల్యూ మహిళా బృందం పరామర్శించి బాగోగులు అడిగి తెలుసుకున్నారు. గుడాల రాంబాబును పరామర్శించిన వారిలో రాష్ట్ర అధ్యక్షురాలు అత్తిలి విమల, జిల్లా కార్యదర్శి ఎండి.బేగం, జిల్లా అధ్యక్షులు వనజాక్షి, జిల్లా కార్యవర్గ సభ్యులు ఏ.దేవుడమ్మ, బి.పుష్పలత తదితరులు ఉన్నారు.

17న టీఎస్సార్ జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర- విశాఖపట్నం: రాజ్యసభ మాజీ సభ్యులు డాక్టర్ టి.సుబ్బరామిరెడ్డి జన్మదిన వేడుకలు తెలుగు శక్తి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తున్నామని తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ ఒక ప్రకటనలో తెలిపారు. 17న (మంగళవారం) జన్మదిన వేడుకలు వాల్తేర్ అప్‌లాండ్స్‌లోని టిఎస్ఆర్ నివాసం వద్ద జరుగుతాయన్నారు. ఆరోజు ఉదయం 9 గంటలకు ఘనంగా నిర్వహిస్తున్నామని, ఈ కార్యక్రమానికి ఆయన అభిమానులు, శ్రేయోభిలాషులు, మిత్రులు అందరూ రావలసిందిగా బి.వి.రామ్ పిలుపునిచ్చారు.

బాయ్స్ హాస్టల్-2లో ఇద్దరు ఉద్యోగుల సస్పెన్షన్

జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: సీతమ్మధారలోని సాంఘిక సంక్షేమ శాఖ బాయ్స్ హాస్టల్ - 2లో ఇద్దరు ఉద్యోగులను సస్పెండ్ చేసినట్లు జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ తెలిపారు. హాస్టల్ సంక్షేమ అధికారి ఆర్.ప్రసాదరావును సస్పెండ్ చేస్తూ, కాంట్రాక్ట్ ఉద్యోగి ఎం.అప్పారావును విధుల నుంచి తొలగించినట్లు పేర్కొన్నారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. సీతమ్మ దార సాంఘిక సంక్షేమ శాఖ బాయ్స్ హాస్టల్ - 2లోని మరుగుదొడ్లను శుభ్రపరిచేందుకు అక్కడ విద్యార్థులను వినియోగించినట్లు ఈ నెల 9వ తేదీన ఫిర్యాదు అందిందని అన్నారు. విచారణలో నిజ నిరూపణ అయినందున, దీనికి కారణమైన ఆ ఇద్దరు ఉద్యోగులను సస్పెండ్ చేసినట్లు కలెక్టర్ వివరించారు.

పేదలకు నూతన వస్త్రాలు వితరణ

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: పూర్ణ మార్కెట్ వర్తక సంఘం సెక్రటరీ గంగాడ గోవింద్ ఆధ్వర్యంలో వినాయక మహోత్సవాలు పురస్కరించుకొని ప్రేమ సమాజంలో అన్న సమారాధన, నూతన వస్త్రాల వితరణ కార్యక్రమం జరిగింది. అన్నసంతర్పణ అనంతరం దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ చేతులమీదుగా వృద్ధులకు చీరలు, నూతన వస్త్రాలు, పళ్ళు, స్వీట్స్‌ను అందజేసి తమ సేవా దృక్పథాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రేమ సమాజంలో మంచి కార్యక్రమం ఏర్పాటు చేసిన గోవిందుని అభినందించారు. అదే విధంగా మరింత మంది ముందుకు వచ్చి సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో స్థానిక నేతలు, కూటమి శ్రేణులు పాల్గొన్నారు.

సీనియర్ జర్నలిస్ట్ దుర్గా ప్రసాద్‌కు జాతీయ అవార్డు

విశాలాంధ్ర - విశాఖ సిటీ: విశాఖ నగరానికి చెందిన సీనియర్ జర్నలిస్టు దుర్గా ప్రసాద్‌కు జాతీయ స్థాయిలో అవార్డు దక్కింది. భారత సేవా రత్నం పేరిట సోమలరాజు ఫౌండేషన్ ఓ పురస్కారాన్ని ప్రకటించగా దుర్గా ప్రసాద్ ఎంపికయ్యారు. బెంగళూరులోని జక్కూరులో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సముదాయ భవన్‌లో శనివారం నిర్వహించిన ఆ సంస్థ 12వ వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా దుర్గా ప్రసాద్‌కు ఈ అవార్డును అందజేశారు. వివిధ రంగాల్లో నిష్ణాతులు, సమాజ సేవకుల్ని జాతీయ స్థాయి అవార్డులతో అతిథులచే సత్కరించిట్టు ఫౌండేషన్ వ్యవస్థాపకులు శివ రాజు తెలిపారు. విశాఖలోని విక్టరీ మీడియా రీజినల్ కో%-%ఆర్డినేటర్‌గా పని చేస్తున్న దుర్గా ప్రసాద్‌కు 'భారత సేవా రత్న' అవార్డును అందజేయడం సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా దుర్గా ప్రసాద్ మాట్లాడుతూ ఓ జర్నలిస్టుగా ఈ సమాజానికి చేస్తున్న సర్వీస్‌తోపాటు, తాను చేపడుతున్న సామాజిక సేవా కార్యక్రమాల్ని గుర్తించి ఇంతటి గొప్ప అవార్డుతో సత్కరించిన సోమరాజు ఫౌండేషన్ సభ్యులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యానికి మేలు

విశాలాంధ్ర - ఆనందపురం: మానవుని ఆరోగ్య జీవనానికి ముఖ్యమైన ప్రకృతి వ్యవసాయ పంటలతో ఆరోగ్యం చేకూరుతుందని జిల్లా వ్యవసాయ వ్యవసాయ అధికారి అప్పలస్వామి పేర్కొన్నారు. శనివారం మండలంలోని బోని రైతు సేవా కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేంద్రియ పద్ధతుల ద్వారా వ్యవసాయాన్ని చేపట్టినట్లయితే రసాయనాల వాడకాన్ని తగ్గించడానికి అవకాశం ఉంటుందన్నారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా కషాయాలను తయారుచేసి పంటలకు వేసినట్లయితే చీడపురుగులు నివారించవచ్చు నన్నారు తద్వారా పంటలకు రసాయన ఎరువులు ఉపయోగించ నవసరం లేదన్నారు. ఈ సందర్భంగా రైతు సేవా కేంద్రంలో ఆరు రకాల కషాయాలను ఏ విధంగా తయారు చేయాలో రైతులకు వివరించి తయారు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ మోహన్ రావు, రీజనల్ అధికారులు ప్రకాష్, హేమ సుందర్, వీఏఏ దిలీప్, బోని గ్రామ సర్పంచ్ సూరాల సత్య వరప్రసాద్, బాలామణి, యూనిట్ ఇన్చార్జ్ పైడితల్లి, పొట్నూరు యూనిట్ ఐసిఆర్‌పిలు, రైతులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేట్‌పరం కానివ్వం

మా నిబద్ధతను శంకిస్తున్న మీ చిత్తశుద్ధి ఏంటి..? వైసీపీపై గంటా ఫైర్

విశాలాంధ్ర - గోపాలపట్నం: గ్రేటర్ విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ విషయంలో ఇప్పటికే తమ నిబద్ధత నిరూపించుకున్నామని, జగన్మోహన్ రెడ్డి చిత్తశుద్ధి ఏంటని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు నిలదీశారు. అధికారంలో ఉండగా వైసీపీ వైఫల్యం కారణంగానే ప్రైవేటీకరణ ప్రతిపాదన ముందుకు వెళ్లిందని తెలిపారు. ఆంధ్రుల హక్కుగా సాధించుకున్న విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేట్ పరం కానివ్వమని స్పష్టం చేశారు. సింహాచలంలో, సిరిపురం వి.ఎం.ఆర్.డి.ఎ. చిల్డ్రన్స్ ఎరీనా వద్ద తనను కలిసిన మీడియాతో ఈ అంశంపై ఆయన మాట్లాడారు. ప్రతిపక్షంలో ఉండగా స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా తాను ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసినప్పుడు అధికారంలో ఉన్న విజయ సాయిరెడ్డి గానీ వైసీపీ ఎంపీలు గానీ ఎందుకు రాజీనామా చేయలేదని ప్రశ్నించారు. ఇప్పటి గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ఆమరణ దీక్ష చేశారని, అధికారంలోకి వచ్చిన నెల రోజుల్లోనే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గర్భాం మాంగనీస్ గనుల లీజును పొడిగించారని చెప్పారు. సాక్షాత్తు స్టీల్ మంత్రి కుమారస్వామి విశాఖ వచ్చి మరీ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ఉండబోదని చేసిన విస్పష్ట ప్రకటన కూటమి విజయమని తెలిపారు. వాజపేయి ప్రధానిగా ఉన్నప్పుడు చేసిన ప్రైవేటీకరణ ప్రతిపాదన చంద్రబాబు చొరవ కారణంగా ఆగిపోయిందని గుర్తు చేశారు. తెలుగు ప్రజలకు విశాఖ స్టీల్‌ప్లాంట్ ఒక పరిశ్రమ కాదని, సెంటిమెంట్ అని పేర్కొన్నారు. అధికారంలో ఉండగా స్టీల్‌ప్లాంట్ కోసం పార్లమెంటులో ప్రశ్నించని, ఎలాంటి త్యాగాలు చేయని వైసీపీ ఎంపీలకు ఆ పరిశ్రమ పేరెత్తే అర్హత లేదన్నారు. ఇలాగే ప్రభుత్వ రంగంలో స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరిస్తామని ప్రతిపాదిస్తే ఆ రాష్ట్ర సీఎం ఏ ప్రైవేటు సంస్థ వస్తుందో చూస్తానని హెచ్చరిక చేయడంతో అప్పట్లో కేంద్రం దిగి వచ్చిందని, కార్మికుల్లో ఆశలు రేకెత్తించే ఒక్క ప్రకటన కూడా వైసీపీ ప్రభుత్వం చేయలేదని ధ్వజమెత్తారు. ప్రతి అంశాన్ని రాజకీయం చేయడం వైసీపీ ఎంపీ విజయసాయి రెడ్డికి అలవాటని విమర్శించారు. ప్లాంట్‌లో జరుగుతున్న పరిణామాలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకు వెళతామని, ప్రధానికి నివేదిస్తామని పేర్కొన్నారు.

సత్వర న్యాయాన్ని అందించడమే లోక్ అదాలత్ ధ్యేయం

జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: కక్షిదారులకు సత్వర న్యాయం అందించడమే లోక్ అదాలత్ ధ్యేయమని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్ పేర్కొన్నారు. ప్రజలు, కేసులతో సంబంధం ఉన్న కక్షిదారులు, వివిధ శాఖలు తమ కేసులను పరిష్కరించుకునేందుకు ఇదొక మంచి వేదికని, ఇలాంటి వేదికలను తప్పక సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. జాతీయ లోక్ అదాలత్ ప్రారం భోత్సవ కార్యక్రమం స్థానిక కోర్టు ప్రాంగణంలోని న్యాయ సేవాసదన్ వద్ద శనివారం ఉదయం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్ కక్షిదారులను ఉద్దేశించి మాట్లాడారు. దేశ, రాష్ట్ర అత్యున్నత న్యాయ స్థానాల ఆదేశాల మేరకు జిల్లావ్యాప్తంగా జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమం ద్వారా జిల్లాలోని న్యాయస్థానాల్లో ఉన్న పెండింగ్ కేసులు, సివిల్, చెక్ బౌన్స్, బ్యాంకింగ్, మోటార్ ప్రమాదాల నష్ట పరిహారాల కేసులు, సెక్షన్ 138 నెగోషియబుల్ ఇనుస్ట్రమెంట్స్ చట్టం కేసులు, బ్యాంకు, మనీ రికవరీ కేసులు, ల్యాండ్ అక్విజిషన్ కేసులు, కార్మిక, కుటుంబ తగాదాలు (విడాకులు కేసులు కాకుండా), పారిశ్రామిక వివాదాలు, రాజీ పడదగ్గ క్రిమినల్ కేసులు పరిష్కరించబడతాయని ఆయన వివరించారు. కావున కక్షిదారులు పెద్ద ఎత్తున కేసులను రాజీ చేసుకొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. తొలుత రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ చైర్మన్, రాష్ట్ర హైకోర్ట్ న్యాయమూర్తి అమరావతి నుంచి ప్రారంభించిన డిజిటల్ జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎం.వి.శేషమ్మ పాల్గొన్నారు. అనంతరం జిల్లా కార్యక్రమాన్ని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రారంభించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎం.వి. శేషమ్మ, కమర్షియల్ కోర్టు జడ్జ్ కేశవ చార్యులు, మహిళా కోర్టు జడ్జ్ బి.శ్రీనివాసరావు, ఎస్సి, ఎస్టీ కోర్టు జడ్జ్ పి.శ్రీసత్యదేవి, ఫస్ట్ అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జ్ ఎం.డి.వి.ఎన్. సింధూర, ఫోర్త్ అడిషనల్ చీఫ్ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ కె.వాసుదేవరావు తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ నిర్ణయంతోనే స్టీల్‌ప్లాంట్ రక్షణ సాధ్యం

విశాలాంధ్ర - కూర్మన్నపాలెం: విశాఖ స్టీల్‌ప్లాంట్ రక్షణకు రాజకీయ నిర్ణయంతోనే సాధ్యమని సీపీఎం స్టీల్ డివిజన్ కార్యదర్శి వి.శ్రీనివాసరాజు అన్నారు. స్టీల్‌ప్లాంట్ సిఎంఎస్ జంక్షన్ వద్ద గాజువాకలో జరిగే మహాధర్నా గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరాజు మాట్లాడుతూ 32 మంది ప్రాణ త్యాగంతో అనేక వేలమంది తమ విలువైన భూములను త్యాగం చేస్తేనే విశాఖ స్టీల్‌ప్లాంట్ ఉద్భవించిందని అన్నారు. దీనిపై రాష్ట్రంలోని రాజకీయ పార్టీలు ఏకాభిప్రాయాన్ని కేంద్రానికి వినిపించని కారణంగా కేంద్రం దీనిని కోమాలోకి నెట్టిందని ఆయన తీవ్రంగా విమర్శించారు. ఈ విషయంపై సీపీఎం తన స్థాయిలో పోరాటానికి మద్దతు ఇస్తూ తన పోరాటాన్ని కొనసాగిస్తోందని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో స్టీల్ సిఐటియు ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి, జిల్లా సిఐటియు అధ్యక్షులు కెఎం శ్రీనివాస్, స్టీల్ సిఐటియు అధ్యక్షులు వైటి దాస్, స్టీల్ సిపిఎం, సిఐటియు నాయకులు టివికె రాజు, బి.మహేష్, కృష్ణమూర్తి, విడివి పూర్ణచంద్రరావు, దేముడునాయుడు, ఆర్.దుర్గాప్రసాద్, సూర్య నారాయణ, శ్రీనివాస్, సిహెచ్ వెంకట్రావు, కాంట్రాక్ట్ లేబర్ యూనియన్ గౌరవాధ్యక్షులు ఓవి రావు తదితరులు పాల్గొన్నారు.

కాపులు అన్ని రంగాల్లో రాణించాలి

విశాలాంధ్ర - విశాఖ సిటీ: కాపులు అన్ని రంగాల్లోనూ రాణించాలని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆకాంక్షించారు. బీచ్ రోడ్డులోని ఒక ఫంక్షన్ హాల్‌లో జరిగిన కాపు టీచర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్రస్థాయి సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాపు కుల ఐక్యత కోసం ఏర్పడిన ఆంధ్రప్రదేశ్ కాపు టీచర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కు అండగా ఉంటామన్నారు. 10వ తరగతి, ఇంటర్, ఐ.ఐ.టి, నీట్ తదితర పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు స్కాలర్ షిప్ ఇచ్చి ప్రోత్సహించడాన్ని అభినందించారు. కాపు యువతకు 5 శాతం రిజర్వేషన్, కాపు కార్పొరేషన్ లో టీచర్లకు డైరెక్టర్ పదవులు వంటి కోర్కెల పట్ల సానుకూల నిర్ణయం తీసుకునేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అన్ని రంగాల్లో కాపులు ఐక్యతతో అభ్యున్నతి సాధించాలని పిలుపునిచ్చారు. 20 వేల మంది కాపులున్న టీచర్స్ రాజకీయంగా కూడా ప్రభావం చూపించగలరని పేర్కొన్నారు. పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు మాట్లాడుతూ రాజకీయంగా కాపులు బలోపేతం కావాలని అన్నారు. కార్యక్రమంలో జనసేన భీమిలి ఇన్‌చార్జి పంచకర్ల సందీప్, 98వ వార్డు కార్పొరేటర్ పి.వి.నరసింహం, కాపు సామాజిక వర్గం రాష్ట్ర నాయకులు దాసరి రాము, దొరరాజు, కాపు టీచర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ప్రతినిధులు పాల్గొన్నారు.

అక్షయ పాత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో హెరిటేజ్ ఫెస్ట్ -2024

విశాలాంధ్ర - ఆనందపురం: భారతదేశ సాంస్కృతి కళలను ప్రోత్సహించి వాటి గొప్పతనాన్ని భావి భారత పౌరులకు తెలియజేయవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉందని విశాఖ పార్లమెంటరీ సభ్యులు ఎం.శ్రీ భరత్ పేర్కొన్నారు. శనివారం ఆనందపురం మండలం గంభీరం హరే కృష్ణ మూమెంట్స్, అక్షయపాత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో హెరిటేజ్ బెస్ట్ 2024 పేరిట నిర్వహించిన పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న భరత్ మాట్లాడుతూ అంత రించిపోతున్న కళలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. పోటీల్లో సుమారు 50 పాఠశాలలో 2 వేలు మంది విద్యార్థులు పాల్గొన్నారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు, మెమొంటోలు అందించారు. ఈ కార్యక్రమంలో భీమిలి శాసనసభ్యులు గంటా శ్రీనివాసరావు, హరే కృష్ణ మూమెంట్స్ అక్షయ్ ఫౌండేషన్ ప్రెసిడెంట్ నిష్కించిన భక్తదాస్, మాజీ శాసనసభ్యులు గండి బాబ్జి, వాగ్దేవి విద్యా మందిర్ కరస్పాండెంట్ రాధాకృష్ణ, శ్రీ వెంకట్ విద్యాపీట్ కరస్పాండెంట్ రొంగలి వెంకటేశ్వరరావు, నాయకులు బి.ఆర్‌బి నాయుడు, తాట్రాజు అప్పారావు, బమ్మిడి తారక్, మహంతి శివాజీ, కే.శ్రీను, ముత్యాలరావు, అసెంటి పాఠశాల కరస్పాండెంట్ పి.శంకర్రావు, వివిధ పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డ్రెయిన్‌లో పడిన ఆవుదూడ

రెస్క్యూ చేసి కాపాడిన ఫైర్ సిబ్బంది

విశాలాంధ్ర - పెదగంట్యాడ: 75వ వార్డు కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి వెంకట రమణా రెడ్డి ఇంటి సమీపంలో ఉన్న పాఠశాల దగ్గరలోని డ్రైన్‌లో ఆవుదూడ పడిపోయింది. స్థానికులు 75వ వార్డు కార్పొరేటర్ దంపతులకు విషయాన్ని తెలయపరచగా వెంటనే పెద గంట్యాడ అగ్నిమాపక సిబ్బందికి తెలియజేయగా వారు వచ్చి దానిని బయటకు తీశారు.

అప్పన్నను దర్శించుకున్న ప్రముఖులు

విశాలాంధ్ర - సింహాచలం: ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామి వారిని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, కర్ణాటక మాజీ ఉపముఖ్యమంత్రి ఆర్.అశోక్ దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ఘన స్వాగతం పలికారు. తొలుత వీరు కప్ప స్తంభం ఆలింగనం చేసుకున్నారు. పిదప బేడా ప్రదక్షిణ చేసి తమ తమ గోత్ర నామాలతో స్వామివారికి సంకల్పం చేయించారు. దర్శనా నంతరం వేద పండితుల ఆశీర్వచనం పలికారు. ప్రధాన అర్చకులు జి.శ్రీనివాసాచార్యులు స్వామివారి చిత్ర పటం ఇచ్చి, శేష వస్త్రంతో సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. వీరి వెంట స్థానిక కార్పొరేటర్ పీవీ నరసింహం, టీడీపీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు ఉన్నారు.

జాతీయ భాషగా హిందీకి విస్తృత ప్రాచుర్యం కల్పించాలి

విశాలాంధ్ర - పెందుర్తి: దేశానికి వెన్నెముకగా ఉన్న జాతీయ భాష హిందీ పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ప్రముఖ విద్యావేత్త, గాయత్రి విద్యా పరిషత్ ఉపాధ్యక్షులు ఆచార్య దక్షిణామూర్తి పిలుపునిచ్చారు. శనివారం ఉదయం బీచ్ రోడ్‌లోని గాయత్రి విద్యా పరిషత్ ఉన్నత పాఠశాలలో రాజ భాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యా సంస్థలోని జాతీయ భాష హిందీని తప్పనిసరి చేయాలని కోరారు. సరళీకృత విధానాలు, ప్రపంచీకరణ నేపథ్యంలో నేటి విద్యార్థులు హిందీ పట్ల శ్రద్ధ సాగుతోందని చెప్పారు. ఉపాధి, ఉద్యోగాల వేటలో హిందీ పట్ల ప్రాధాన్యత తగ్గించకూడదని చెప్పారు. కార్యక్రమానికి పాఠ శాల ప్రిన్సిపాల్ కే.మధురవాణి అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో హిందీ విభాగం అధ్యాపకులు ఎన్జీ భవాని, ఎస్.జ్యోతి, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్నారులు సూరదాసు, కబీరు, తులసీదాసు వంటి వారి చిత్రాలు కవితలతో ఆకట్టుకున్నారు. బాలల హిందీ ప్రదర్శన అందర్నీ అలరించింది.

సీఎం చంద్రబాబు ఫోటోకు పాలాభిషేకం

విశాలాంధ్ర - భీమిలి: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర భూగర్భ, గనులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర కృషి ఫలితంగా ఎస్-ఎస్ఈబి రద్దుపరచి, ప్రొహిబిషన్ ఎక్సైజ్ శాఖను మళ్లీ పునరుద్ధరణ చేసినందుకు వారి ఫొటోలకు క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సై పి.చిన్నంనాయుడు సిబ్బంది పాల్గొన్నారు.

కృష్ణాపురం, రౌతులపాలెం గ్రామాల్లో భారీ అన్నదానం

విశాలాంధ్ర - పద్మనాభం: పద్మనాభం మండలం కృష్ణాపురం, రౌతులపాలెం గ్రామాలలో శనివారం భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమనికి చుట్టుపక్కల గ్రామాల నుండి కూడా భారీగా భక్తులు వచ్చి ఈ అన్నదాన కార్యక్రమంలో స్వామి వారి ప్రసాదం స్వీకరించారు. కృష్ణాపురం గ్రామంలో 3000 మంది ఈ అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారని ఉత్సవ కమిటీ తెలియజేశారు. రౌతులపాలెం గ్రామంలో 3,200 మంది ఈ అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నట్లు వినాయక యూత్ కమిటీ తెలిపింది. ఈ అన్నదాన కార్యక్రమాలలో ఆయా గ్రామాల యువతి యువకులతో పాటు గ్రామ పెద్దలు నాయకులు, వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బాక్సింగ్ పోటీల్లో అలేఖ్యకు బంగారు పతకం

విశాలాంధ్ర - మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతం పరిధి సింధియాకి చెందిన వద్దాది హరి నేవీ ఉద్యోగి వీరి కుమార్తె అలేఖ్య బాక్సింగ్ పోటీల్లో బంగారు పతకం సాధించింది. పంజాబ్ కెవి 53 నేషనల్ ఆంధ్రప్రదేశ్ తరపున 40, 42 కేజీల విభాగంలో వద్దాది అలేఖ్య గోల్డ్ మెడల్ సాధించింది. అలేఖ్య శ్రీహరిపురానికి చెందిన మైక్ టైసన్ క్లబ్ ఆర్మీ ప్రసాద్, రైల్వే కోచ్ షైక్ ఆలీ శిక్షణలో సిటీలో ఉన్న సాయి అకాడమీ కోచ్‌లు దుర్గారావు, కన్నా ఆధ్వర్యంలో గోల్డ్ మెడల్ సాధించింది.

సింహాచలం దేవస్థానం ఈఓ బదిలీ

విశాలాంధ్ర -సింహాచలం: ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామి వారి దేవస్థానం ఈఓ ఎస్.శ్రీనివాసమూర్తి మాతృ శాఖకు బదిలీ అయ్యారు. శనివారం సాయంత్రం సాధారణ పరిపాలన శాఖకు రిపోర్ట్ చేయవలసినదిగా రాష్ట్ర దేవాయశాఖ కమీషనర్ నుండి జీ.ఓఆర్‌టీ నెంబరు 1777 ద్వారా ఆదేశాలు అందాయి.

అన్నసమారాధనలు ప్రారంభించిన శరగడం

విశాలాంధ్ర - పెందుర్తి: జీవిఎంసీ 96వ వార్డు పరిధిలో పలు చోట్ల వినాయక నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఆయా చోట్ల పూజాదికాలతో పాటు భారీ ఎత్తున అన్నసమారాధనలు నిర్వహిస్తున్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అనకాపల్లి రూరల్ జిల్లా మాజీ అధ్యక్షుడు, మాజీ కార్పోరేటర్ శరగడం చిన అప్పలనాయుడు రాతిచెరువు, దొగ్గవానిపాలెం, పెందుర్తి పాతఊరు, పెందుర్తి కూడలి, సాయినగర్, ద్రోణంరాజు నగర్, దుర్గానగర్ మండపాలను సందర్శించి వినాయకుడి పూజలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఏర్పాటు చేసిన అన్నసమారాధన కార్యక్రమాలను ప్రారంభించి భక్తులకు ప్రసాదవితరణ చేసారు. ఆయన వెంట అవగడ్డ స్వామినాయుడు, దుర్గానగర్ మల్లేష్, నాగఅప్పారావు, శరగడం శ్రీను, హరి తదితరులు ఉన్నారు.

గణపతి పూజలలో గొర్లె రామునాయుడు

విశాలాంధ్ర - పెందుర్తి: జీవిఎంసీ 96వ వార్డు పరిధిలోని వెలమపేట, బండారు వీధి, రాజు చెరువు, భూలోకమాంబ గుడి వద్ద ఏర్పాటు చేసిన వినాయక మండపాలను భారతీయ జనతాపార్టీ పెందుర్తి నియోజకవర్గం కన్వీనర్ గొర్లె రామునాయుడు సందర్శించారు. పార్టీ నాయకులు, అభిమానులతో కలిసి ఆయా మండపాల వద్ద పూజాదికాలు నిర్వహించి నిర్వాహకులు ఏర్పాటు చేసిన అన్నసమారాధనలో పాల్గొన్నారు. కార్యక్రమంలో గొర్లె శ్రీనివాసరావు, రామనాయుడు, గురునాథ్, ఆనంద్, బండారు శ్రీనివాసరావు, రమేశ్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఛానల్ సేవలను విస్తరించిన సామ్‌సంగ్ టీవీ ప్లస్

విశాలాంధ్ర - విశాఖపట్నం: భారతదేశంలో సామ్‌సంగ్ ఉచిత యాడ్ సపోర్టెడ్ స్ట్రీమింగ్ టీవీ (ఫాస్ట్) సర్వీస్ అయిన సామ్‌సంగ్ టీవీ ప్లస్ తన పోర్ట్‌ఫోలియోలో నాలుగు కొత్త ఛానెల్‌లను ప్రారంభించడానికి ఇండియా టీవీ గ్రూప్‌తో జతకట్టింది. ఈ భాగస్వామ్యంలో భాగంగా ఇండియా టీవీ గ్రూప్ కనెక్టెడ్ టీవీ (సీటీవీ) ప్రత్యేక ఛానెల్‌లు ఇండియా టీవీ, ఇండియా టీవీ స్పీడ్ న్యూస్, ఇండియా టీవీ ఆప్ కి అదాలత్, ఇండియా టీవీ యోగా ఇప్పుడు సామ్‌సంగ్ టీవీ ప్లస్ ప్లాట్‌ఫామ్‌లో అందుబాటులో ఉన్నాయి. వీక్షకులు ఇప్పుడు వార్తలు, కరెంట్ అఫైర్స్, ఫిట్‌నెస్, వినోదంలనుండి విస్తృతమైన అధికనాణ్యత కంటెంట్ ఆఫర్‌లకు సులభంగా వీక్షించి ఆస్వాదించవచ్చు. సామ్‌సంగ్ టీవీ ప్లస్‌అనేది సామ్‌సంగ్ స్మార్ట్ టీవీలలో ముందే ఇన్‌స్టాల్ చేయబడిన ఉచిత స్ట్రీమింగ్ సేవ.ఎంపిక చేసిన దేశాలలో వార్తలు, క్రీడలు, వినోదం, మరిన్నింటితో సహా అనేక రకాల ఛానెల్‌లను అందిస్తోంది.

ఐవేల్యూ ఇన్ఫో సొల్యూషన్స్ డిఆర్‌హెచ్‌పి దాఖలు

విశాలాంధ్ర - విశాఖపట్నం: భారతదేశంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న సాంకేతిక సేవలు పరిష్కారాల ఇంటిగ్రేటర్‌లో ఒకటి (ఫ్రాస్ట్ సుల్లివన్ నివేదిక ప్రకారం)గా ఉన్న సంస్థ ఐ వేల్యూ ఇన్ఫో సొల్యూషన్స్ లిమిటెడ్ ప్రారంభ పబ్లిక్ ఆఫర్ కోసం క్యాపిటల్ మార్కెట్స్ రెగ్యులేటర్ సెబీ వద్ద వద్ద డ్రాఫ్ట్ రెడ్ హెర్రింగ్ ప్రాస్పెక్టస్‌ను దాఖలు చేసింది. బెంగళూరుకు చెందిన కంపెనీ యొక్క ఐపిఓ (1.87 కోట్లు) ముఖ విలువ గల రూ.ఈక్విటీ షేర్ల వరకు అమ్మకానికి పూర్తి ఆఫర్ విక్రయిస్తున్న వాటాదారుల ద్వారా ఒక్కొక్కటి 2. ప్రమోటర్ వాటాదారులు సునీల్ కుమార్ పిళ్లై, కృష్ణ రాజ్ శర్మ, శ్రీనివాసన్ శ్రీరామరే కలిసి 22,42,197 (22 లక్షలు) ఈక్విటీ షేర్లను ఆఫ్‌లోడ్ చేస్తున్నారు. ఇన్వెస్టర్ సెల్లింగ్ షేర్‌హోల్డర్ సుందరా (మారిషస్) లిమిటెడ్, ప్రైవేట్ ఈక్విటీ సంస్థ క్రేడార్ యొక్క అనుబంధ సంస్థ ఐ వేల్యూ ఇన్ఫో సొల్యూషన్స్.

గొల్లలపాలెంలో కుంకుమ పూజలు

విశాలాంధ్ర - ఆనందపురం: మండలంలోని కుసులవాడ పంచాయతీ గొల్లలపాలెంలో శనివారం వినాయక ఉత్సవాలలో

భాగంగా బాలకృష్ణ శర్మ ఆధ్వర్యంలో మహిళలు కుంకుమ పూజలు నిర్వహించారు. ఉత్సవ కమిటీ నిర్వహించిన ఈ కార్యక్రమంలో మహిళలు పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజలు చేపట్టారు. ఈ సందర్భంగా బాలకృష్ణ శర్మ వేదమంత్రాలతో శాస్త్రీయబద్ధంగా మహిళలతో పూజలను జరిపించారు. కుంకుమపూజ ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు యూత్ ప్రెసిడెంట్ పడగల సూర్య, మహిళలు ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కేసుల పరిష్కారానికి రాజీయే రాజబాట

విశాలాంధ్ర - చోడవరం: కేసుల పరిష్కారానికి రాజీయే రాజబాట అని 9వ అదనపు జిల్లా జడ్జి కె.రతన్ కుమార్ తెలిపారు. స్థానిక కోర్టు భవనముల సముదాయంలో శనివారం జాతీయ మెగా లోక్ అదాలత్, న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా జడ్జి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ చట్టపరమైన కేసులు రాజీ చేసుకోవాలంటే లోక్ అదాలత్ సరి అయిన వేదిక

అన్నారు. భూ తగాదాలు, కుటుంబ కలహాలు, ఆర్థిక లావాదేవీల్లో రాజీ పడిన ఇరువర్గాలు మధ్య సమస్యలను చట్ట ప్రకారం పరిష్కరింపబడుతాయని తెలియ జేసారు. వేరే కేసుల్లో ఒకరికి మాత్రమే విజయం వరించి, మరొకరు పరాజయం చెందుతారని, లోక్ అదాలత్ లో పరిష్కరింపబడిన కేసుల్లో ఇరువర్గాలు సమ న్యాయం పొందుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సివిల్ జడ్జి ఈ.రాజేంద్ర బాబు, జూనియర్ సివిల్ జడ్జి జి.స్వర్ణ, అదనపు జూనియర్ సివిల్ జడ్జి బి. సూర్యకళ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.డేవిడ్, న్యాయవాదులు, సిబ్బంది పాల్గొన్నారు.

డీఆర్‌హెచ్‌పీని దాఖలు చేసిన హెక్సావేర్ టెక్నాలజీస్

విశాలాంధ్ర -విశాఖపట్నం: ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో కూడిన గ్లోబల్ డిజిటల్, టెక్నాలజీ సేవల సంస్థ హెక్సావేర్ టెక్నాలజీస్ లిమిటెడ్ విభిన్న శ్రేణి కస్టమర్లను కలిగి ఉంది. ఇందులో 31 ఫార్చ్యూన్ 500 సంస్థలతో సహా క్యాపిటల్ మార్కెట్స్ రెగ్యులేటర్ సెబీకి డీఆర్‌హెచ్‌పీని దాఖలు చేసింది. ప్రారంభ పబ్లిక్ ఆఫర్ ద్వారా.రూ. ముంబై ప్రధాన కార్యాలయ సంస్థ యొక్క 9,950 కోట్ల ఐపిఓ అనేది సీఏ మాగ్నమ్ హోల్డింగ్స్ (కార్లైల్ ప్రైవేట్ ఈక్విటీ యొక్క అనుబంధ సంస్థ), ప్రమోటర్ సెల్లింగ్ షేర్‌హోల్డర్ ద్వారా అమ్మకానికి పూర్తి ఆఫర్. హెక్సావేర్ అమెరికా, యూరప్, ఆసియా-పసిఫిక్ (భారతదేశం మరియు మధ్యప్రాచ్యంతో సహా) అంతటా వినియోగదారులకు సేవలు అందిస్తోంది మరియు 16 కార్యాలయాల మద్దతుతో 38 డెలివరీ కేంద్రాలను కలిగి ఉన్న గ్లోబల్ డెలివరీ ఉనికిని కలిగి ఉంది.

యాదవ్ యూత్ ఆధ్వర్యంలో అన్నసమారాధన

విశాలాంధ్ర - మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతం పరిధి 61వ వార్డు మల్కాపురం యాదవ్ యూత్ ఆధ్వర్యంలో శనివారం అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమానికి 61వ వార్డు మహిళ అధ్యక్షురాలు సర్వసిద్ధి శ్రీలక్ష్మి పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా యువత సేవా గుణాన్ని అలవర్చుకోవడం అభినంద నీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యాదవ్ యూత్ యువత స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్ఆర్ నగర్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నవరాత్రి ఉత్సవాలు

విశాలాంధ్ర - కొమ్మాది: కొమ్మాది వైస్సార్ కాలనీలో వైఎస్ఆర్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రతీ సంవత్సరం లాగే ఈ సంవత్సరం కూడా ఘనంగా శ్రీ వరసిద్ధి వినాయక నవరాత్రులు ఉత్సవం అత్యంత వైభవంగా నిర్వహించడం జరుగుతుంది. ఇందులో భాగంగా సామూహిక సహస్ర కుంకుమార్చన గణపతి హెూమం ఈరోజు స్వామి వారికి విశేష పూజలు నిర్వహించి తదనంతరం మధ్యాహ్నం ధాతలు పిళ్లా యోగేశ్వరరావు, అబ్బిరెడ్డి సురేష్, షరీఫ్ సహాయ సహకారంతో సుమారు 3,000 మందికి పైగా భక్తులుకు అన్న సంతర్పణ ఘనంగా నిర్వ హించారు. ఈ కార్యక్రమంలో భక్తులు, కాలనీవాసులు, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

భారీ గణనాథుడుని దర్శనానికి పోటెత్తిన భక్తజనం

విశాలాంధ్ర - కొమ్మాది: గ్రేటర్ విశాఖపట్టణం జోన్ -2లోని 7వ వార్డు మధురవాడ చంద్రంపాలెంలో కొలువుతీరిన 33 అడుగుల భారీ గణనాథుడుని మండపంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిగాయి. ముందుగా శ్రీ వరసిద్ధి వినాయకాయ స్వామి వారికి నిత్య పూజా కార్యక్రమాలు బ్రాహ్మణోత్తములచే జరిపించారు. రెండవ శనివారం సెలవు దినం కావడంతో భక్తులు స్వామి వారి దర్శనానికి పోటెత్తారు. భీమిలి నియోజకవర్గం జనసేన ఇన్చార్జి పంచకర్ల సందీప్, 7వ వార్డ్ జనసేన అధ్యక్షులు నాగోతి నర్సినాయుడు తదితరులు స్వామి వారిని దర్శించు కున్నారు. వారిని ఉత్సవ కమిటీ సభ్యులు దుశ్శాలుతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామస్థులు, యూత్ సభ్యులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించడం జరిగింది.

ఓఎస్డి సుబ్బారావుని కలిసిన న్యాయవాది

విశాలాంధ్ర - పెదగంట్యాడ: రెవిన్యూ, రిజిస్ట్రేషన్ స్టాంప్స్ శాఖ మంత్రి అనగాని సత్య ప్రసాద్ ఓఎస్డి సుబ్బారావుని ప్రముఖ న్యాయవాది పెంటకోట వెంకట నాగేశ్వరావు మర్యాదపూర్వకంగా కలిసారు. శనివారం సచివాలయంలో కలిసి ఇటీవలే రిజిస్ట్రేషన్ శాఖ ఓఎస్డీగా రిటైర్ అయిన తరువాత మంత్రి

ఓఎస్‌డిగా నియమితులైనందుకు శుభాకాంక్షలు తెలిపారు. స్టాంప్ రెవెన్యూ స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖలో ప్రస్తుతం ఉన్నటువంటి విధానాలు కొన్ని ప్రజలకు ఇబ్బందికరంగా ఉన్నాయని రిజిస్ట్రేషన్ శాఖలో జరుగుతున్నటువంటి అక్రమ లుపై ఈ సందర్భంగా ఓఎస్‌డి సుబ్బారావు దృష్టికి తీసుకెళ్లారు. మంత్రి అనగాని సత్యప్రసాద్ ఓఎస్‌డి సుబ్బారావు కచ్చితంగా స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖలో ప్రక్షాళన చేస్తామని నిబద్ధతో పనిచేసే వారికి మంచి గుర్తింపు ఉంటుందని మిగిలిన వారికి శాఖ పై విధంగా పనిచేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా ఓఎస్ డి సుబ్బారావు తెలిపారు.

ఎంఈఎంఎస్ పరిశ్రమలకు స్థల పరిశీలన

విశాలాంధ్ర - చీడికాడ: పరిశ్రమలు ఏర్పాటుతోనే యువతకు ఉద్యోగ అవకాశాలు ప్రాంతాల అభివృద్ధి సాధ్యమవుతుందని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అన్నారు. మండలంలోని ఎంఈఎంఎస్ పరిశ్రమల స్థల సమీకరణకు జి.కొత్తపల్లి అడవిఅగ్రహారం గ్రామాలలో పరిశ్రమల ఏర్పాటుకు భూమిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాడుగుల నియోజకవర్గ వెనకబడి ఉండడంతో గతంలో పరిశ్రమ ఏర్పాటుకు హామీ ఇచ్చామని ఆ హామీలు నెరవేరుస్తున్నమన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నియోజ కవర్గంలో రెండు పరిశ్రమలు ఏర్పాటుకు అనుమతిచ్చారని ఒకటి నియోజకవర్గంలోని ఆర్లి గ్రామంలో పరిశీలించగా రెండవది అడవిఅగ్రహారం గ్రామంలో పరిశీలించామన్నారు. రైతులను ఎటువంటి ఇబ్బంది పెట్టకుండా స్థలసమీకరణ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ పంచాయతీ అధికారులు కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఆదర్శ్‌లో ప్రాథమిక చికిత్స అవగాహన సదస్సు

విశాలాంధ్ర - పెందుర్తి: స్థానిక ఆదర్శ్ డిగ్రీ కాలేజ్‌లో శనివారం ప్రాథమిక చికిత్స అవగాహన సదస్సు నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ ఎన్‌ఈ ఫ్లోరా తెలియజేశారు. ఈ అవగాహన సదస్సు కు చీఫ్ గెస్ట్ గా పి. రవికుమార్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ డిస్ట్రిక్ట్ సెక్రటరీ, రిసోర్స్ పర్సన్ ట్రైనర్ రహమతుల్లా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆదర్శ్ విద్యార్థులు, సిబ్బందికి ప్రాథమిక చికిత్స గురించి అవగాహన కల్పిస్తూ హార్ట్ స్ట్రోక్ వచ్చినప్పుడు సి.పి.ఆర్ ఎలా చేయాలి, ఎమర్జెన్సీ సమయంలో ఎలాంటి పద్ధతులు పాటించాలో మొదలగు విషయాలను రహమతుల్లా వివరించారు. కార్యక్రమంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆదర్శ్ కళాశాలకు బెస్ట్ డిస్టెన్ అవార్డుతో పాటు ఇండిపెండెన్స్ డే సందర్భంగా జరిగిన ప్యారేడ్‌లో పాల్గొన్న 14 మంది విద్యార్థులకు సర్టిఫికెట్స్ అందజేశారు. ఈ ఫస్ట్ ఎయిడ్ ప్రోగ్రాంలో ఎన్ఎస్ఎస్ 3 యూనిట్స్ కోఆర్డినేటర్స్ జి.మంజుల, డి.ఎస్.ప్రదీప్, ఎన్.సంధ్యారాణి, కళాశాల విద్యార్థిని, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ టి.థియోఫిలస్ మాట్లాడుతూ ఈ అవగాహన సదస్సు అత్యవసర సమయంలో ఎలా స్పందించాలి మొదలగు విషయాల తెలుసుకోవడం వల్ల భవిష్యత్తులో ఉపయోగపడుతుందని ఆపదలో ఉన్న వారి ప్రాణాలు కాపాడవచ్చు అని వివరించారు.

1311వ రోజుకు ఉక్కు దీక్షలు

విశాలాంధ్ర - కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద 1311వ రోజు జరుగుతున్న రిలే నిరాహార దీక్ష శిబిరంలో స్టీల్ సిఐటియు ప్రతినిధులు, కార్మికులు పాల్గొన్నారు. దీక్షా శిబిరాన్ని ఉద్దేశించి విశాఖ పార్లమెంట్ సభ్యులు శ్రీ భరత్ మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌పై ప్రైవేటీకరణ వెనక్కి తీసుకునే అంతవరకు కార్మిక పోరాటాలకు అండగా ఉంటామని ఆయన స్పష్టం చేశారు. దీనిని పూర్తిస్థాయి ఉత్పత్తి చేయడానికి అవసరమైన నిర్ణయాలను కేంద్రం తీసుకునే విధంగా కృషి చేస్తానని ఆయన అన్నారు. ఇది జరగాలంటే కార్మికులు అధికారులు సమన్వయంతో పనిచేసే దీనిని ముందుకు తీసుకువెళ్లాలని ఆయన అభ్యర్థించారు. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పల్ల శ్రీనివాస్ మాట్లాడుతూ నిజాయితీతో నిబద్ధతతో నేటి వరకు పోరాటానికి మద్దతు పలికామని నేడు ఉన్న పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని కార్మికులకు భరోసా కల్పించడం కోసం మేము ఇక్కడికి విచ్చేసామని ఆయన అన్నారు. స్టీల్ ప్లాంట్ యంత్రాంగం అవినీతికి పాల్పడితే తమ దృష్టికి తీసుకురావాలని కార్మికులను కోరారు. వీటిపై స్పందించిన కార్మిక సంఘాల ప్రతినిధులు ఉక్కు యాజమాన్యం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను, కర్మాగారం వినాశనానికి దారితీస్తున్న పరిస్థితులను ప్రజాప్రతినిధులకు వివరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి విశాఖ జిల్లా అధ్యక్షులు గండి బాబ్జి, స్థానిక కార్పొరేటర్లు బొండా జగన్, లేళ్ల కోటేశ్వరరావు, పోరాట కమిటీ ప్రతినిధులు డి.ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, జె.అయోధ్యరామ్, యు.రామస్వామి, కెఎస్ఎన్ రావు, విళ్ళ రామ్మోహన్ కుమార్, దొమ్మేటి అప్పారావు, డివి రమణారెడ్డి, డి.సురేష్ బాబు, కొమ్మినేని శ్రీనివాస్, దాలి నాయుడు, జీఆర్‌కె నాయుడు, శ్రీనివాస్ నాయుడు, వరసాల శ్రీనివాస్, బి.కామేష్, నమ్మి సింహాద్రి స్టీల్ ఎగ్జిక్యూటివ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కెవిడి ప్రసాద్, ఓబీసీ అసోసియేషన్ అధ్యక్షులు బి.అప్పారావు స్టీల్ సిఐటియు వివిధ విభాగాల అధ్యక్ష కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రజా గాయకుడు గంగిరెడ్డి సన్యాసిరావుకు కన్నీటి వీడ్కోలు

విశాలాంధ్ర - గాజువాక: ప్రజాగాయకుడు, కవి, రచయిత కామ్రేడ్ గంగిరెడ్డి సన్యాసిరావు (74) శనివారం కన్నుమూశారు. గత కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన గాజువాకలో గల తన చిన్న కుమారుడు సుందరయ్య ఇంటి వద్ద మరణించారు. ఆయన మృతదేహాన్ని గాజువాక నుండి కేజీహెచ్‌కు అంతిమయాత్ర నిర్వహించి అనంతరం ఆయన పార్థవదేహాన్ని అనాటమీ డిపార్టుమెంటుకు అప్పగించారు. సన్యాసిరావు బిహెచ్‌పివిలో ఉద్యోగం చేస్తూ నిరంతరం ప్రజా ఉద్యమాలకు తన పాటల ద్వారా ఉత్సాహాన్ని, ఊపునిచ్చేవారు. సన్యాసిరావుకి కంటిచూపులేదని ఎన్నడూ తన వృత్తికి, ఉద్యమాలకు దూరంకాలేదు. మల్కాపురం మెయిన్‌రోడ్డులోనే తను నివాసం ఉండేవారు. ప్రతిరోజు ఉదయం తన ఇంటికి ఎవరైనా వస్తే ప్రజాశక్తి దినపత్రిక ఇచ్చి చదివించుకునేవారు. పార్టీ ఇచ్చిన పిలుపులలో తన కంజర పట్టుకొని ముందుండేవారు. ఆయన గాయకుడే కాక రచయిత కూడా. ప్రభుత్వాలు ప్రజలపై భారాలు మోపుతే వాటిని పాట, నాటిక రూపంలో ప్రజలను చైతన్యం కల్పించడంలో ఆయనకాయనే సాటి. ఆయన మరణా నంతరం ఆయన దేహాన్ని కూడా ప్రజలకు ఉపయోగపడేలా వైద్య విద్యార్థుల పరిశోధనకు అందజేయాలన్న కోరికమేరకు వారి కుటుంబ సభ్యులైన భార్య నాగేంద్ర రాజ్యలక్ష్మి, కుమారుడు స్టాలిన్, సుందరయ్య, కుమార్తె చైతన్య, అల్లుడు కృష్ణలు జ్యోతిబసు దేహదాన ప్రోత్సాహక సంస్థ ద్వారా కేజీహెచ్ అనాటమీకి అప్పగించారు. సన్యాసిరావు మరణం ప్రజాఉద్యమాలకే కాక సిపిఎం పార్టీకి, ప్రజాసంఘాలకు, వామపక్ష, అభ్యుదయ కళారంగానికి తీరనిలోటు. ఆయన మృతికి సంతాపం తెలియజేస్తూ, వారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, 78వ వార్డు సిపిఎం కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు, సీనియర్ నాయకులు రెడ్డిపల్లి బాబూరావు, ఎన్.కృష్ణమూర్తి, అరుణ్‌జీ, జి.రమణ, చంటి, బి.పద్మ, ఎ.అజయశర్మ, లీలావతి, భాషా, మౌలాలి, దండు నాగేశ్వరరావు, పి.మణి, ఆర్.భాగ్యలక్ష్మి, జ్యోతిబసు దేహదాన ప్రోత్సాహక సంస్థ కార్యదర్శి వి.ప్రభావతి కార్యకర్తలు తెలియజేసారు.

శివశక్తి నగర్‌లో భారీ అన్న సమారాధన

విశాలాంధ్ర - కొమ్మాది: జీవీఎంసీ ఐదో వార్డు పరిధిలో శివశక్తి నగర్ లో ఎస్ఎస్ఎన్ బాయ్స్ ఆధ్వర్యంలో చేపడుతున్న వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా శనివారం మధ్యాహ్నం భారీ అన్న సమారాధన నిర్వహించారు. మధురవాడ జోన్ కళింగ సేవా సంఘం అధ్యక్షులు, బి ఎల్ ఆర్ రియల్ ఎస్టేట్ అధినేత బగాది లక్ష్మణరావు ఆర్థిక సహాయంతో చేపట్టిన అన్న సమారాధనకు వేలాదిమంది భక్తులు తరలి వచ్చి స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు. ముఖ్య అతిథులుగా బగాది లక్ష్మణరావు , జనసేన రాష్ట్ర నాయకులు నక్క శ్రీధర్, కొర్రాయి సురేష్, బి టి డి శ్రీకాంత్, ఈమంది శ్రీను, నిర్వాహకులు బి సురేష్, మనీ, సాయి, శ్రీను, ధన, శేఖర్ తదితరులు పాల్గొనగా అన్నదాత బగాధి లక్ష్మణరావు మాట్లాడుతూ యువత తర తమ బేధాలు లేకుండా భక్తి శ్రద్ధలతో శ్రీ వినాయక ఉత్సవాలు నిర్వహించి అన్న సమారాధన కార్యక్రమాలు నిర్వహించడం ఆనందదాయకమన్నారు. ఇలాంటి ఉత్సవాలు నిర్వహించడం వల్ల ఆధ్యాత్మికతతో పాటు నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని తెలుపుతూ ప్రతి ఒక్కరూ ఇలాంటి ఉత్సవాలకు సహాయ సహకారాలు అందించాలని పిలుపునిచ్చారు.

విజయవాడ వరద బాధితులకు శ్రీ గణేష్ గాయత్రి బ్రాహ్మణ సేవా ట్రస్ట్ వితరణ

- చోడవరం ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్.రాజుకు చెక్కు అందించిన బ్రాహ్మణ సేవా ట్రస్ట్

విశాలాంధ్ర - చోడవరం: విజయవాడ వరద బాధితులను ఆదుకునేందుకు" మేము సైతం" అంటూ చోడవరం శ్రీ గణేష్ గాయత్రి బ్రాహ్మణ సేవా ట్రస్ట్ రూ.42,502 చెక్కును స్థానిక ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్.రాజుకు శనివారం అందజేశారు. మండలంలోని పి.ఎస్.పేట గ్రామంలో శ్రీ లక్ష్మి గణపతి ఆలయం లోని కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యేను శ్రీ గణేష్ గాయత్రి సేవా ట్రస్ట్ అధ్యక్ష, కార్యదర్శులు కలసి విజయవాడ వరద బాధితుల సహాయం కోసం బ్రాహ్మణ సభ్యులు నుండి సేకరించిన విరాళాలను సి.ఎం.రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేశారు. సభ్యులు నుండి సేకరించిన విరాళాలు రూ. 17,502/-లు తో బాటు చేసినారు, ట్రస్ట్ చైర్మన్ కందర్ప కృష్ణమూర్తి (కిష్టప్ప) ఆదేశాలతో ట్రస్ట్ కామన్ గుడ్ ఫండ్ నుండి రూ.25,000/- లు కలిపి మొత్తం రూ.42,502/- లు ఎమ్మెల్యే కు అందజేశారు. ఎమ్మెల్యేకు చెక్కును అందజేసిన వారిలో శ్రీ గణేష్ గాయత్రి బ్రాహ్మణ సేవా ట్రస్ట్ అధ్యక్షుడు పుత్రే వు శ్యామ్ ప్రసాద్, కార్యదర్శి వింజమూరి శంకర్, ఉపాధ్యక్షుడు ఉపాధ్యాయుల శ్రీనివాసరావు, కోశాధికారి కందర్ప సత్యనారాయణ మూర్తి (మెడికల్ షాప్ మూర్తి), వారణాశి రామలింగ శాస్త్రి డి.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

కామ్రేడ్ సీతారాం ఏచూరికి విప్లవ నివాళులు

విశాలాంధ్ర - చోడవరం: భారత కమ్యూనిస్టు పార్టీ (సిఐటియు) కామ్రేడ్ సీతారామ్ ఏచూరికి శనివారం విప్లవ నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి, ఆశ, మధ్యాహ్నం భోజన కార్మికులు హాజరయ్యారు. "నేలకొరిగిన ఎర్ర సూరీడు" అంటూ సీతారాం ఏచూరి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. నిరాడం బరుడుగా నిరంతరం కార్మికులు, విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం శ్రమించే వారని, విద్యార్థి దశ నుండి కమ్యూనిస్ట్ భావజాలాలకు ఆకర్షితుడై ప్రజా పోరాటాల వైపు అడుగులు వేశారని, ఒక కేంద్ర సీపీఎం పార్టీకి ప్రధాన కార్యదర్శి అయినప్పటికీ అతి సాధారణ జీవితం గడిపారని అన్నారు. కమ్యూనిస్టు పార్టీ, మార్క్సిస్టు మహా మేధావిని ఎప్పటికీ మరువలేమని, ఆయన ఆశయాల సాధనకు నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కోశాధికారి వీ.వీ శ్రీనివాసరావు సి.పి.ఎం పార్టీ మండల నాయకులు ఎస్.వి నాయుడు, సిఐటియు జిల్లా కార్యదర్శి గూనూరు వరలక్ష్మి, అంగన్వాడి ఆశ మధ్యాహ్న భోజన కార్మికులు పాల్గొన్నారు.